ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

గురువారం 13 జూన్ 2024



అనిత అనే నేను..

మంత్రివర్గంలో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు అవకాశం



మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వంగలపూడి అనిత

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి కేవలం ఒక్కరికి మాత్రమే రాష్ట్ర కేబినెట్‌లో స్థానం దక్కింది. పాయకరావుపేట నుంచి టీడీపీ తరపున రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన వంగలపూడి అనితను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆమె తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైసీపీ అక్రమాలు, అన్యాయాలపై చేసిన పోరాటానికి ఫలితంగా మంత్రి పదవి లభించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక వర్గం కూడా కొంతవరకు దోహదపడింది. చక్కటి వాక్చాతుర్యం, ఉన్నత విద్య, ధైర్యంగా మాట్లాడగల నేర్పు...ఇవన్నీ ఆమెకు ప్లస్ పాయింట్లుగా మారాయి.

ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికే ఛాన్స్

ఉపాధ్యాయురాలి నుంచి మంత్రి స్థాయికి...

2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక

ఇటీవల ఎన్నికల్లో భారీ మెజారిటీతో రెండోసారి విజయం

అనకాపల్లి/పాయకరావుపేట, జూన్ 12: విద్యావంతురాలైన వంగలపూడి అనిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో ఉద్యోగానికి రాజీనామా చేసి, 2013లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోమారు అక్కడి నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. బుధవారం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వంలో అనిత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.



మంత్రి అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోటవురట్ల టీడీపీ నేతలు

కుటుంబ నేపథ్యం...

ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరంలో వంగలపూడి అప్పారావు, స్నేహలత దంపతులకు 1979 మార్చి 24న అనిత ...మిగతా 6వ పేజీలో

సేవే పరమావధిగా పనిచేస్తా!

విజనరీ లీడర్ చంద్రబాబు మంత్రి వర్గంలో చోటు దక్కడం పూర్వజన్మ సుకృతం

మంత్రి వంగలపూడి అనిత



అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా పనిచేసి, రాష్ట్రాభివృద్ధిలో తనవంతు బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. మంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. చంద్రబాబు కల్పించిన అవకాశానికి జన్మజన్మలూ రుణపడి ఉంటానన్నారు. ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తనకు రాజకీయంగా ఎదిగేందుకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించడమే కాకుండా, గతంలో ఎమ్మెల్యేగా, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రిగా సముచిత స్థానం కల్పించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు అపూర్వ విజయాన్ని అందించారని, మంత్రిగా వారి సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు. సాధారణ మహిళపై పూర్తి నమ్మకంతో ప్రజలకు సేవ చేసేందుకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అరకు పార్లమెంట్ పరిధిలో సంధ్యారాణికి అవకాశం

సాలూరు ఎమ్మెల్యేను వరించిన మంత్రి పదవి

తొలిసారి ఎన్నికైనా కేబినెట్‌లో చోటు

ఏజెన్సీ వ్యాప్తంగా కూటమి నేతల హర్షాతిరేకాలు



మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గుమ్మిడి సంధ్యారాణి

(పాడేరు-ఆంధ్రజ్యోతి) అరకులోయ పార్లమెంట్ స్థానంలో సాలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన గుమ్మిడి సంధ్యారాణికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కడం పట్ల కూటమి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అరకు పార్లమెంట్ స్థానం వైసీపీకి కంచుకోటగా ఉండడంతో 2014, 2019 ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీ స్థానాన్ని ఆ పార్టీ కైవశం చేసుకుంది. చేస్తుంది. తాజా ఎన్నికల్లో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదింటిని కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోగా, వైసీపీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. పార్వతీపురం ఎస్సీ రిజర్వుడు కాగా రంపచోడవరం, పాడేరు, అరకులోయ, సాలూరు, కురుపాం, పాలకొండ స్థానాలు ఎస్టీ రిజర్వుడు. వాటిలో అరకులోయలో బీజేపీ అభ్యర్థి పాంగిరాజారావు, పాలకొండలో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, రంపచోడవరంలో మిరియాల శిరీషాదేవి, పాడేరులో గిడ్డి ఈశ్వరి, కురుపాంలో తొయ్యాక జగదీశ్వరి, సాలూరులో గుమ్మిడి సంధ్యారాణి టీడీపీ అభ్యర్థులుగా బరిలోదిగారు. పాడేరు, అరకులోయ మినహా రంపచోడవరంలో టీడీపీ అభ్యర్థి మిరియాల శిరిషాదేవి, పాలకొండలో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, కురుపాంలో టీడీపీ అభ్యర్థి తొయ్యాక జగదీశ్వరి, పార్వతీపురంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయకుమార్, సాలూరులో టీడీపీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి విజయం సాధించారు.

తొలిసారి గెలిచి మంత్రిగా...



ఎమ్మెల్యేగా మొదటిసారి విజయం సాధించిన గుమ్మిడి సంధ్యారాణికి మంత్రివర్గంలో చోటు దక్కడం విశేషం. ఆమె 2009లో సాలూరు ఎమ్మెల్యేగా, 2014లో అరకులోయ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ ఆమె సేవలను గుర్తించిన చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఈసారి సాలూరు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆమె మంచి మెజారిటీతో విజయం సాధించారు. గిరిజన సామాజిక వర్గం నుంచి మంత్రివర్గంలో సంధ్యారాణికి అవకాశం కల్పించారు. గతానికి భిన్నంగా అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలో కూటమి ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు దక్కడంపై మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి బడులు

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

జిల్లాకు పూర్తిగా రాని పాఠ్య పుస్తకాలు

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 2975 పాఠశాలల్లో అనేకచోట్ల మౌలికవసతుల కల్పన ప్రధాన సమస్యగా మారింది. నాడు-నేడు రెండో విడతలో భాగంగా 949 పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.216 కోట్లు మంజూరుచేయగా ఇంతవరకు రూ.69.93 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులు చాలక పలు పాఠశాలల్లో పనులు సగంలో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు వసతులు అందుబాటులోకి రాలేదు. ఆయా చోట్ల పాఠశాల ఆవరణ చిందరవందరగా మారింది. వర్షాకాలం వస్తున్నందున ఏజెన్సీలో పిల్లలకు వసతి, రహదారుల సమస్య పట్టిపీడిస్తోంది. జిల్లాలో సుమారు 1.8 లక్షలమంది విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లు పూర్తిగా చేరలేదు. గురువారం విద్యార్థులకు కిట్లు ఇస్తారని చెబుతున్నా మండల కేంద్రాల్లో నిల్వలు లేవు. గత ఏడాది బదిలీల్లో మైదాన ప్రాంతాల నుంచి పాడేరు ఏజెన్సీకి 400 మంది టీచర్లు వచ్చారు. ఎక్కువమంది ఏజెన్సీలో పనిచేయడానికి ఇష్టపడక సెలవుల్లో ఉన్నారు. వీరిలో ఎంతమంది తిరిగి పాఠశాలలకు వస్తారనేది అనుమానమే. మొత్తంగా ఏజెన్సీలో టీచర్లకొరతతో పాటు పర్యవేక్షణ లోపం వెంటాడుతోంది.

పెదవలస రేంజ్ ఆఫీసర్ జగదీష్ సస్పెన్షన్

అక్రమంగా చెట్ల నరికివేతలో పర్యవేక్షణ లోపంగా గుర్తించిన అధికారులు

ఈ మేరకు చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు

కొయ్యూరు, జూన్ 12: పెదవలస రేంజ్ ఆఫీసర్ జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవి చౌదరి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు చింతపల్లి అటవీ డివిజన్ అధికారి సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యూరు అటవీ సెక్షన్ పరిధి చింతవానిపాలెం అటవీ ప్రాంతంలో కార

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాడు, మంప బీట్‌లకు చెందిన సిబ్బంది సహకారంతో 142 నల్లమద్ది చెట్లు నేలకూల్చి, వాటి కలపను తూర్పుగోదావరి జిల్లాకు తరలించారు. సోలాబు సమీప అటవీ ప్రాంతంలో అటవీశాఖ అద్వర్యంలో 1990కు ముందు వేసిన టేకు ప్లాంటేషన్‌లో 50 చెట్లు గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. శరభన్నపాలెం బీట్ అంతాడ పంచాయతీ ఎద్దుమామిడి అటవీ ప్రాంతంలో గల సుమారు 40 మలబారు వేప చెట్లను స్మగ్లర్లకు అప్పగించారు. ఈ వ్యవహారమంతా కొయ్యూరు అటవీ సెక్షన్ సిబ్బంది మూకుమ్మడిగా స్మగ్లర్లతో చేతులు కలిపి అక్రమార్జనకు పాల్పడినట్టుగా ఫిర్యాదులు అందాయి. దీంతో అటవీశాఖకు చెందిన రాష్ట్ర విజిలెన్సు సిబ్బంది విచారణ జరిపి చింతవానిపాలెం, కొత్తపల్లి అటవీ ప్రాంతంలో 142 నల్లమద్ది మొద్దులు (మొదళ్లు) గుర్తించారు. సోలాబు పాత టేకు ప్లాంటేషన్‌లో స్క్వాడ్ డీఎఫ్‌వో బృందం పరిశీలించి 29 టేకు మొదళ్ల గుర్తించగా, విజిలెన్సు అధికారులు మరో 21 మొదళ్ల గుర్తించారు. ఇవి కాకుండా అంతాడ ఎద్దుమామిడి, సింగదార అటవీ ప్రాంతంలో 20 టేకు చెట్లు, మలబారు వేప మొదళ్ల గుర్తించారు. ఇదిలా ఉండగా కొయ్యూరు సమీప చింతవానిపాలెం గొల్లువలస మధ్య ఈ సిబ్బంది సహకారంతో పోడు వ్యవసాయం పేరుతో 106 తంగిడ చెట్లు నరికించినట్టు గుర్తించిన విషయాలపై మే 21న 'అటవీ సెక్షన్‌లో అక్రమాలెన్నో' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీని ఆధారంగా కొయ్యూరు సెక్షన్ పరిధిలో సెక్షన్ ఆఫీసర్ సింహాద్రి, బీట్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న రాజ్‌కుమార్, రాకేష్‌లను పది రోజుల క్రితమే సస్పెండ్ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. తాజాగా బుధవారం ఈ అక్రమాలకు పర్యవేక్షణ లోపంగా భావిస్తూ రేంజర్ జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ పీసీసీఎఫ్ ఆదేశాలు జారీ చేసినట్టు డీఎఫ్‌వో తెలిపారు.

పాడేరు ఘాట్‌లో ఘోరం



గాయపడిన వారిని అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

» వ్యాన్ బోల్తా: ముగ్గురు మృతి » 11 మందికి తీవ్ర గాయాలు

» మృతులు, బాధితులు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రాంత వాసులు

» వ్యాన్ బ్రేకులు ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్న పోలీసులు

పాడేరు ఘాట్‌లో ఘోరం జరిగింది. పెదబయలులో మోదకొండమ్మ ఉత్సవాలకు స్టేజి అలంకరణలు చేసే సిబ్బంది బుధవారం తిరిగి వస్తుండగా వ్యాన్ బ్రేకులు ఫెయిలవడంతో ప్రయాణికులు లోయలోకి తుళ్లిపోయారు. వారిపై బరువైన ఇనుప సామగ్రి పడిపోవడంతో ముగ్గురు మృతిచెందగా, మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

-వార్త మెయిన్‌లో..







లోయలో పడిన వ్యాన్‌లోని స్టేజీ, సౌండ్ సిస్టమ్ సామగ్రి. (ఇన్‌సెట్లో) మృతి చెందిన రాయి అశోక్, పంచదార్ల లక్ష్మణ్ (ఫైల్ ఫొటో)



టెన్త్‌లో 585 మార్కులు సాధించిన ధారమణిని సత్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

విద్యతోనే సమాజాభివృద్ధి

ఐటీడీఏ పీవో వి.అభిషేక్

'సూపర్ 50' విద్యార్థులకు సత్కారం

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 'సూపర్ 50' పేరిట నిర్వహించిన ప్రత్యేకబోధనలో తర్ఫీదు పొంది, పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీవో మాట్లాడారు. ప్రత్యేక బోధనను సద్వినియోగం చేసుకుని 50 మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించడంతో తన కల నెరవేరిందని, తానే పరీక్షలు ... మిగతా 6వ పేజీలో

మన్యంలో కూటమి శ్రేణుల సంబరాలు

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారం

వివిధ ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

వీక్షించిన అధికారులు, మూడు పార్టీల నాయకులు



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో స్క్రీన్‌పై సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని జనం వీక్షిస్తున్న దృశ్యం

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలంతా తిలకించేందుకు వీలుగా వివిధ ప్రాంతాల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రజలంతా వీక్షించేందుకు వీలుగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సెంటర్ బిగ్ ఎల్‌డీఈ స్క్రీన్

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ప్రజలు వీక్షించేందుకు అధికారులు అంబేడ్కర్ సెంటర్‌లో ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో విజయవాడలోని ... మిగతా 6వ పేజీలో

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

హాజరైన ఇరు రాష్ట్రాల అధికారులు

బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో నీటి నిల్వ. 17.9124 టీఎంసీలు, ఏపీ వాటా 6.9409 టీఎంసీలు

ఒడిశా వాటా 10.9715 టీఎంసీలుగా పంపకం



బలిమెల జలాశయం నీటి వినియోగంపై సీలేరులో సమావేశమైన రెండు రాష్ట్రాల అధికారులు

సీలేరు, జూన్ 12: ఆంధ్రా ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై బుధవారం సీలేరు ఏపీ జెన్‌కో అతిథిగృహంలో ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమై నీటి వినియోగంపై చర్చించారు. 2023-24 నీటి సంవత్సరంలో బలిమెల జలాశయం నుంచి ఏయే రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకుంది, ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వలను లెక్కగట్టారు.దీని ప్రకారం 2022-23 నీటి సంవత్సరంలో ఆంధ్రా ఒడిశా కంటే అధికంగా వినియోగించుకున్న 13.7578 టీఎంసీలు కలసి 2023-24 మే నెలఖరుకు 61.6317 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు, ఒడిశా 57.6011 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీనిప్రకారం ఇప్పటివరకు ఆంధ్రా 4.0306 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు నిర్ధారించారు. ప్రస్తుతం జోలాపుట్, బలిమెల జలాశయాల్లో 17.9124 టీఎంసీల నీటి నిల్వలున్నాయని, ఇందులో ఆంధ్రా వాటాగా 6.9409 టీఎంసీలు, ఒడిశా వాటా 10.9715 టీఎంసీలుగా పంపకాలు చేశారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాలు ఇరిగేషన్, విద్యుత్ డిమాండ్ అవసరాల నిమిత్తం ఆంధ్రాకు 1,500 క్యూసెక్కుల నీటిని, ఒడిశాకు 3,300 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి వినియోగించుకోవడానికి అధికారుల మధ్య ఏకగ్రీవంగా ఒప్పందం కుదిరింది. ఈ మావేశంలో ఒడిశా నుంచి బలిమెల హైడ్రోపవర్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయిదాస్ (ఎలక్ట్రికల్), డిప్యూటీ మేనేజర్ ఉమేష్‌పాత్రో, సీహెచ్ బెహరా, అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ పాణాగ్రాహి, చిత్రకొండ ఎర్త్‌డ్యామ్ డివిజన్ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ రమాకాంత్‌పాత్రో, ఏఈఈ తుషార్‌రంజన్ కుంటియా, అసిస్టెంట్ ఇంజనీర్ గదాధర్ ప్రధాన్, మన రాష్ట్రం నుంచి ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకరరావు, డీఈఈ వెంకటమధు, ఏఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.




పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు... వాహనాలతో కిక్కిరిసిన పాడేరు మెయిన్ రోడ్డు

తిరుగు ప్రయాణికులతో రద్దీ

» కిక్కిరిసిన పాడేరు వీధులు

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారంతో ముగియడంతో వివిధ ప్రాంతాల నుంచి పాడేరు వచ్చిన జనమంతా బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో రద్దీ వాతావరణం నెలకొంది. ఉత్సవాల కోసం సుమారు వారం, పది రోజుల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా పాడేరు వచ్చారు. ఈ దపా ఉత్సవాలు వాయిదా పడడంతో పాటు 13వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో అధికశాతం జనం బుధవారమే తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో బస్సులు, కార్లు, జీపులు కిక్కిరిసిపోయాయి. స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. వాహనాల రాకపోకలతో పట్టణంలోని రోడ్లన్నీ నిండిపోయాయి. పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది.

అందరికీ ధన్యవాదాలు: కలెక్టర్

మోదకొండమ్మ ఉత్సవాలను విజయవంతం చేయడంలో భాగస్థులైన అందరికీ జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవాల్లో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి చక్కని సమన్వయంతో సేవలందించారన్నారు. ఉత్సవాల్లో విధులు నిర్వహించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శ్రద్ధతో పనిచేశారని ప్రశంసించారు. పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుపరచడం, ప్రత్యేక వైద్య సేవలు అందించడం, పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడిపిందన్నారు. ఉత్సవాల్లో ప్రతి అంశాన్నీ చక్కగా కవర్ చేసిన మీడియాను కలెక్టర్ అభినందించారు. ఉత్సవాలకు సహకరించిన అధికారులు, అనాధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ప్రజలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా

» సీలేరు పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు



సీలేరు పీహెచ్‌సీలో మందులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

సీలేరు, జూన్ 12: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా సూచించారు. గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ భాషా ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ రికార్డులను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పీహెచ్‌సీలో వార్డు, లేబర్ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి మలేరియా మందులన్నీ అందుబాటులో ఉన్నాయా? లేదా? అని ఆరా తీశారు. అలాగే అక్కడ అందుబాటులో ఉన్న మలేరియా మందులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి కె.సౌమ్యతో సమావేశమై సీలేరు పీహెచ్‌సీ పరిధిలో నమోదవుతున్న సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. ప్రస్తుతం అపిడిమిక్ సీజన్ కావడంతో పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలో మలేరియా కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా జ్వరాలు ప్రబలితే వెంటనే రక్త నమూనాలను సేకరించి చికిత్స చేయాలని చెప్పారు. అనంతరం ఫీడర్ అంబులెన్సు పనితీరుపై ఆయన ఆరా తీశారు. రహదారులు లేని గ్రామాలకు అత్యవసర కేసులను ఆసుపత్రికి తరలించాలంటే ఫీడర్ అంబులెన్సు వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.జోజిబాబు, ఎన్.త్రినాథ్, మాధురి, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు జిల్లా కలెక్టర్ పరామర్శ



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఘాట్ రోడ్డులో జరిగిన వ్యాన్ ప్రమాదంలో గాయపడి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత బుధవారం రాత్రి పరామర్శించారు. ఈ ప్రమాద వివరాలను పోలీసుల ద్వారా తెలుసుకున్న ఆమె ఆస్పత్రికి వచ్చి, ఆయా వార్డుల్లో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రుల వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు. అలాగే బాధిలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.పద్మావతి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కృష్ణారావు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ అందేలా చర్యలు

» ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జూన్ 12: బ్యాంకు ఖాతాలో పింఛన్ నగదు జమకాని లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొంత మంది పింఛన్ లబ్ధిదారులకు ఆధార్, బ్యాంకు ఖాతాల్లో వేర్వేరుగా పేర్లు నమోదు కావడం, బ్యాంకు ఖాతా యాక్టివ్‌లో లేకపోవడం తదితర సాంకేతిక సమస్యల కారణంగా పింఛన్ జమకాలేదన్నారు. ఈ విధంగా పింఛన్ అందని లబ్ధిదారుల వివరాలు తీసుకుని డీఆర్‌డీఏకు పంపామన్నారు. మూడు, నాలుగు రోజుల్లో ప్రతీ ఒకరికి పింఛన్ అందుతుందన్నారు. అలాగే సచివాలయ కార్యదర్శులు గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. బావులు, మంచినీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

పరాయి పంచన ఎంఈవో కార్యాలయం

» గూడు లేక మండల విద్యా శాఖాధికారుల అవస్థలు

» ప్రత్యామ్నాయ వసతి చూపని అధికారులు

» జడ్పీహెచ్ పాఠశాల, భవిత కేంద్రంలో సర్దుకుపోతున్న ఇద్దరు ఎంఈవోలు

చింతపల్లి, జూన్ 12: మండల విద్యా శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఇద్దరు ఎంఈవోలు ప రాయి పంచన విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొన్నది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సుమారు 40 ఏళ్ల క్రితం మండల విద్యా శాఖ కార్యాలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం మరమ్మతులకు గురైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం భవనం పూర్తిగ శిథిలావస్థకు చేరంది. ఏ క్షణంలో కూలిపోతుందోననే భయంతో విద్యా శాఖ అధికారులు ఈ భవనాన్ని వినియోగించడం వదిలేశారు. విద్యా శాఖ అధికారుల కోసం ప్రత్యామ్నాయ భవనాలు అందుబాటులోలేవు.

మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. గత ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోలను నియమించింది. అయితే విద్యా శాఖ అధికారుల విధులు నిర్వహణకు కనీస సదుపాయాలు కల్పించడంలో గత పాలకులు, అధికారులు విఫలమయ్యారు. కనీసం మండలంలోనున్న ప్రత్యామ్నాయ ప్రభుత్వ భవనాలు విద్యా శాఖ కార్యాలయం నిర్వాహణకు కేటాయించిందిలేదు. డిగ్రీ కళాశాల ఆవరణలో ఓ పైకా భవనం నిరుపయోగంగా పడివున్నది. మండల కేంద్రంలోనున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన మూడు, నాలుగు, ఐదు తరగతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ఈపాఠశాలలోని ఒక భవనాన్ని విద్యా శాఖ కార్యాలయానికి కేటాయిస్తే కొంత సమస్య తీరుతుంది.



జడ్పీహెచ్ స్కూల్ గదిలో కూర్చొని విధులు నిర్వహిస్తున్న ఎంఈవో-1, 2

అయితే ఈదిశగా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు.



శిథిలావస్థలో ఉన్న కార్యాలయ భవనం

తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇద్దరు ఎంఈవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గదిలోని ఓ మూలన సర్దుకుని విధులు నిర్వహించాల్సివస్తున్నది. కంప్యూటర్, రికార్డు వర్క్ భవిత కేంద్రంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉన్నతాధికారులు స్పందిచి శిథిలావస్థకు చేరుకున్న విద్యా శాఖ భవనాన్ని మరమ్మతులు చేపట్టడం లేదా ప్రత్యామ్నాయ భవనాలు కేటాయించడంగా చేయాలని మండలానికి చెందిన ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వట్టిచెరువులో నివాసం ఉంటున్న పీవీటీజీ కుటుంబాల ఇల్లు

వట్టిచెరువు గ్రామం.. అభివృద్ధికి దూరం!

» కనీస సదుపాయాలు కరువు

» విద్య, వైద్యం అందని ద్రాక్ష

» కలుషిత ఊట నీటితో వ్యాధుల భయం

» అగమ్యగోచరంగా ఆదివాసీల జీవనం

జి.మాడుగుల, జూన్ 12:

అధికారుల నిర్లక్ష్యమో.. పాలకుల అలక్ష్యమోగాని మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న వట్టిచెరువు గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస సదుపాయాలు కూడా లేక ఆదివాసీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరికి ఈ గ్రామంలో కొంత మందికి ఆధార్ కార్డులు కూడా లేవంటే, ఆదివాసీ దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జి.మాడుగుల పంచాయతీ కేంద్రంలో ఉన్న వట్టిచెరువు గ్రామంలో ఆరు కుటుంబాలకు చెందిన సుమారు 30 మంది జనాభా జీవనం సాగిస్తున్నారు. వీరంతా కనీస అవసరాలకు కూడా నోచుకోక ఇబ్బందులు



దుర్భరంగా ఉన్న వట్టిచెరువు గ్రామానికి వెళ్లే రోడ్డు

పడుతున్నారు. సీసీ రోడ్డు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు గ్రామంలో మచ్చుకైనా కానరావు. దీంతో ఆదివాసీల జీవనం ఆగమ్యగోచరంగా మారింది.

గ్రామంలో సరైన ఉపాధి మార్గంలేక కుటుంబ పోషణకు భారమై ఆదివాసీలు మైదాన ప్రాంతాలకు వలస బాట పట్టారు. కనీస తాగునీటి సదుపాయం లేక సమీపంలో కలుషిత ఊటనీరు సేకరించుకుని తాగుతున్నారు. దీనివల్ల వ్యాదుల బారిన పడుతున్నామని, ఈ సమయంలో వైద్య సేవలు కూడా అందక ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నామని గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పౌష్టికాహారం లేక పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది. మండల కేంద్రానికి ప్రధాన రహదారి పక్కనే ఉన్న వట్టి చెరువు గ్రామంలో కనీస మట్టరోడ్డు సదుపాయం లేకపోవడం విచారకరం. ప్రధానంగా గ్రామానికి చెందిన పాంగి జానకి, స్వప్న, పల్లవి, గణేశ్‌తో పాటు మరి కొంత మందికి ఆధార్ కార్డులు లేకపోవడంతో పాఠశాలల్లో చేర్పించుకోలేదని తల్లిదండ్రులు 'ఆంధ్రజ్యోతి' ఎదుట వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వట్టిచెరువు గ్రామంలో కనీస సదుపాయాలు కల్పించాలని, అభివృద్ధికి బాటలు వేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

చంద్రబాబుతో రాష్ట్రానికి మంచి రోజులు

» మన్యంలో వాడవాడలా సంబరాలు

చింతపల్లి, జూన్ 12: చంద్రబాబు ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టడంతో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో పాత బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి బుధవారం టీడీపీ నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే రామాలయం వీధిలోనూ వర్తక సంఘం నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారాలు చేయడంతో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో భారీగా వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు ఓటుతో సమాధానం చెప్పారన్నారు. కూటమి అధికారంలో రావడంతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రీమల ఆనందరావు, లక్ష్మణ్, నాగ భూషణం, బేతా నూకరత్నం, చిన్న, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నాయకులు తాటిపాకల రమేశ్, దూనబోయిన రమణ పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బుధవారం కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఏపీ సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని పురస్కరించుకుని మార్కెట్ సెంటర్ దుర్గా మండపం వద్ద కేక్‌ను కట్ చేసి బాణసంచా కాల్చి సందడి చేవారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, జై తెలుగుదేశం, జై జనసేన, జై భారతీయ జనతాపార్టీ అంటూ కార్యకర్తలూ, నాయకులు మార్కెట్‌లో సందడి చేసారు. స్థానిక తేదేపా సీనియర్ నాయకుడు బొర్రా కృష్ణ, నక్కా తిరుమల రావు, ఎస్కె సుభాన్ కేక్‌ను కట్ చేసి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు లూసీ, తేదేపా నాయకులు నక్కా నాధర రావు, నూకరాజు, లక్ష్మణ్, జనసేన నాయకులు నర్సి, చంద్రరావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్ద



చింతపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొర్ర బలరామ్ అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంతో బుధవారం మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి కుంటుబడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజన ప్రాంతం ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ఈ ఈకార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, వనపల జోగిరాజు, బాలరాజు, బొండ్ల చిరంజీవి, ముక్కల మహేశ్, కాకూరి శేఖర్, బీజేపీ ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని బొయితిలి పంచాయతీ మద్దిగరువులో టీడీపీ నేత కిడారి రమేశ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు తీసుకోవడంతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిన్నారావు, అర్జున్, ఎల్.చిన్నారావు, చింటిబాబు, బొంజుబాబు, జానకమ్మ, శైలజ, ప్రసాద్ పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

136 మంది విద్యార్థులకు 'ఏకలవ్య'ల్లో ప్రవేశం

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య కళాశాలల్లో 136 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు స్థానిక గురుకుల కళాశాలలో బుధవారం ప్రవేశాల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ. 85 మంది బాలురు, 51 మంది బాలికలకు ఏకలవ్య కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఇంటర్మీడియట్ గ్రూపుల్లో ప్రవేశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ప్రిన్సిపాళ్లు ఎంవీ.రమణారావు, గురుకులం సెల్ కన్వీనర్లు పీఎస్.మూర్తి, వై.పారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పచ్చకామెర్లు, మలేరియాతో బాలుడి మృతి

సీలేరు, జూన్ 12: పచ్చకామెర్లు, బ్రెయిన్ మలేరియాతో ఓ బాలుడు మృతి చెందాడు. సీపీహెచ్ క్యాంప్‌నకు చెందిన లామా మనోజ్ (17) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి తీవ్రంగా ఫిట్స్ రావడంతో పీహెచ్‌సీలో చేర్చారు. డాక్టర్ మస్తాన్‌వల్లీ మనోజ్‌కు వైద్య పరీక్షలను నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి వాంతులు ఎక్కువ అవుతుండడంతో వైద్యాధికారి మెరుగైన వైద్య సేవల కోసం చింతపల్లి ఆసుపత్రికి రిఫర్ చేశారు. అతన్ని జెన్‌కో సీఎస్‌ఆర్ అంబులెన్సులో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలను నిర్వహించి పచ్చకామెర్లు, టైఫాయిడ్ ఉన్నట్టు గుర్తించి వైద్య సేవలను అందించారు. అయితే మనోజ్ భద్రాచలంలో వైద్యం పొందుతూ మరణించారు. కాగా, మనోజ్‌ను సకాలంలో రిఫర్ చేసి ఉంటే తమకు దక్కేవాడని మృతుడు బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై వైద్యాధికారి మస్తాన్‌వల్లీని వివరణ కోరగా మనోజ్‌కు ఫిట్స్ వస్తున్నాయని చెప్పడంతో ఆ దిశగా వైద్య సేవలను అందించామని, మరుసటి రోజు వాంతులు ఎక్కువ కావడంతో ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి రిఫర్ చేశామని ఆయన తెలిపారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

రాసి చక్కని మార్కులు సాధించినంత అనుభూతి చెందానన్నారు.

రాష్ట్రంలోనే పాడేరు ఐటీడీఏ పరిధిలోని టెన్త్ విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. ఇదే స్ఫూర్తితో ఇంటర్, డిగ్రీ, తదితర ఉన్నత విద్య దిశగా అడుగులు వేయాలన్నారు. జీవితంలో 25 ఏళ్ల వయసు వరకు కష్టపడి చదివితే 60 ఏళ్లుసుఖ పడతారన్నారు. ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల ప్రత్యేకకృషితోనే మంచి ఫలితాలు సాధించారన్నారు. ఇకపై ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన ప్రక్రియను కొనగిస్తామని పీవో పేర్కొన్నారు. గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో 30 మంది బాలికల్లో 23 మంది, దిగువమోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో 20 మంది బాలురలో 13 మంది విశాఖపట్నం మారికవలస కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియేట్‌లో చేరారని, మిగిలిన విద్యార్థులు పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశం పొందారన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రత్యేక బోధన పొందిన విద్యార్థులను పీవో అభిషేక్ నగదు బహుమతితో సత్కరించారు. మొత్తం 50 మంది విద్యార్థుల్లో టెన్త్‌లో 585 మార్కులు సాధించిన కిల్లో ధారమణికి రూ.20వేలు, 566 మార్కులు సాధించిన కిల్లో తిరుపతికి రూ.15వేలు, 561 మార్కులు సాధించిన టి.హరిలాల్‌ప్రసాద్‌కు రూ.10 వేలు అందించారు. మిగిలిన 47 మంది విద్యార్థులకు రూ.2,500 చొప్పున బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. చక్కని ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అనంతరం వారంతా ఐటీడీఏ పీవో అభిషేక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవోలు ఎల్.రజని, కె.వెంకటరమణ, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు, జీవీవీ.ప్రసాద్, ఎస్.సింహాచలం, ఆర్.ధర్మన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

మన్యంలో కూటమి శ్రేణుల సంబరాలు

... 5వ పేజీ తరువాయి

కేసరపల్లిలో సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. అయితే ముందుగా దీనిపై ప్రచారం లేకపోవడంతో పాటు కూటమి నేతలు హాజరయ్యారు. మోదకొండమ్మ ఉత్సవాల్లో జనం మమేకమవడం, విస్తృత ప్రచారం కల్పించకపోవడమే కారణమని కూటమి నేతలు తెలిపారు.

అరకులోయలో మొక్కుబడి ఏర్పాట్లు

అరకులోయ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అరకులోయలోని అధికారులు పట్టించుకోలేదు. చిన్నపాటి టెంటు వేసి స్క్రీన్‌ను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలంతా కూర్చుని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు వీలుగా సరిపడా కుర్చీలు కూడా వేయలేదని స్థానికులు విమర్శించారు. ఎండతీవ్రత లేకపోవడంతో జనం ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని వీక్షించారు. అంతేకాకుండా ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించేందుకు చేస్తున్న ఏర్పాట్లపై అధికారులు కనీసం ప్రచారం చేయకపోవడంపై విమరలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించడంపై ఇంకా వారిలో వైసీపీ ఛాయలు తొలగలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




పాడేరు: సీఎం ప్రమాణ స్వీకారాన్ని కలెక్టరేట్‌లో వీక్షిస్తున్న కలెక్టర్ విజయసునీత, పక్కన జేసీ భావన వశిష్ఠ.... అరకులో అరకొరగా ఏర్పాటు చేసిన స్క్రీన్, టెంట్

అనిత అనే నేను...

... 5వ పేజీ తరువాయి

జన్మించారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు సబ్బవరంలో చదువుకున్న ఆమె డిగ్రీ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో చేశారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ చేసి బీఈడీ పూర్తిచేశారు. ఆ తరువాత ఎంఈడీ చేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పాయకరావుపేట మండలం గజపతినగరం, నర్సీపట్నం మండలం వేములపూడి పాఠశాలల్లో పనిచేశారు. అనంతరం పదోన్నతిపై ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి, 2013లో తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజక ఇన్‌చార్జిగా నియమితురాలైన ఆమె 2014 ఎన్నికల్లో పోటీ చేసి 2,828 ఓట్ల మెజారిటీతో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీలో చక్కటి వాక్చాతుర్యం కలిగిన నేతగా గుర్తింపు పొందారు. 2018లో టీటీడీ బోర్డు మెంబరుగా అనితకు అవకాశం వచ్చినప్పటికీ, అప్పట్లో దానిపై వివాదం తలెత్తడంతో ఆమె ప్రమాణ స్వీకారం చేయకుండా స్వచ్ఛందంగా తప్పుకున్నారు. 2019 ఎన్నికల్లో అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఆమె కొవ్వూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తరువాత నుంచి పాయకరావుపేట ఇచ్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. 2021లో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, అనంతరం పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన ఆమె పార్టీ తరపున ఎన్నో కార్యక్రమాలు సమర్థంగా చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా వెరవకుండా సమస్యలపై పోరాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి మరోమారు పోటీ చేసిన ఆమె 43,727 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆమె సేవలకు గుర్తింపుగా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలోకి తీసుకున్నారు. దీంతో పాయకరావుపేట నియోజకవర్గానికి తొలిసారి మంత్రి పదవి లభించినట్టయ్యింది.

సభా వేదిక వద్ద కోలాహలం







వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..
ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



బస్సెక్కిన అభిమానం







చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

క్రైం... crime news

చెట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి



బొంజుబాబు (ఫైల్)

గూడెంకొత్తవీధి, జూన్ 12: మండలంలోని గూడెంకొత్తపాకలు గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు చెట్టు నుంచి జారి పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గూడెంకొత్తపాకలు గ్రామానికి చెందిన గెమ్మెలి బొంజుబాబు (25) బుధవారం మధ్యాహ్నం తన పొలంలోని మామిడి చెట్టు ఎక్కి కాయలు కోస్తున్నాడు. ఈ క్రమంలో కాలు అదుపు తప్పి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ బొంజుబాబును కుటుంబ సభ్యులు వెంటనే గూడెంకొత్తవీధి ఆస్పత్రికి ప్రైవేటు వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

కలప పట్టివేత.. కోత మిషన్ సీజ్



దాడుల్లో పట్టుబడిన గన్నర దిమ్మలతో అటవీ శాఖ సిబ్బంది

కొయ్యూరు, జూన్ 12: మండలంలో జోగంపేట సోలాబు శివారులో బుధవారం మధ్యాహ్నం అటవీ శాఖ అధికారులు 13 గన్నర దిమ్మలను పట్టుకున్నారు. అలాగే కకోత మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు అటవీ సెక్షన్ పరిధిలో కలప అక్రమ రవాణాకు వీలుగా నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు కొయ్యూరు, రాజేంద్రపాలెం, కాకరపాడు, సోలాబు, జోగంపేట తదితర గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సోలాబు-జోగంపేటల మధ్య అక్రమంగా నిల్వ చేసిన 13 గన్నర దిమ్మలతో పాటు కలప కోత మిషన్‌ను పట్టుకున్నారు. వీటిని కాకరపాడు అటవీ డిపోకు తరలించి కేసు నమోదు చేసినట్టు రేంజర్ తెలిపారు. ఈ దాడులలో పెదవలస, చింతపల్లి రేంజ్‌ల పరిధిలోని అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

విశాఖపట్నం, జూన్ 12: బీచ్ రోడ్‌లో తొట్లకొండ తీరంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొంతకాలంగా ఆ వ్యక్తి మంగమారిపేట, నగరపాలెం పరిసర గ్రామాల్లో భిక్షాటన చేసుకుని జీవించేవాడు. బుధవారం ఉదయం తొట్లకొండ తీరంలో ఉన్న ఒక రెస్టారెంట్ సమీపంలో ముళ్ల పొదల వద్ద తాడుతో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

కూరగాయలు కొనలేం.. తినలేం!

భారీగా పెరిగిన ధరలు
- కిలో టమాటా రూ.60.. కిలో అల్లం రూ.260
- బెండ, ఉల్లి, మిర్చి, వంగ రూ.40
- వినియోగదారుల గగ్గోలు

బుచ్చెయ్యపేట/నాతవరం, జూన్ 12: **మొన్నటి వరకు ఎండలు భగభగ మండిపోతే... ఇప్పుడు కూరగాయల ధరలు భగభగ మంటున్నాయి. వాటి జోలికి వెళ్లాలంటేనే వినియోగదారులు హడలిపోతున్నారు. దీంతో పరిస్థితి ఏం కొనేటట్టు... తినేటట్టు లేదని వాపోతున్నారు.**

మార్కెట్‌లో ఒక్కసారిగా కూరగాయాల ధరలు భారీగా పెరిగిపోయాయి. పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో అదే పరిస్థితి. ఎన్నడూ లేని రీతిలో ధరలు పెరిగిపోయాయి. సామాన్యులు కొనుగోలు చేయలేని విధంగా ధరలు ఆకాశనంటడంతో ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు రూ.100 తీసుకుని వెళ్తే నాలుగైదు రకాల కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.500 తీసుకువెళ్లినా సంచి నిండని పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. అధిక రేట్లతో కొనలేకపోవడంతో కూరగాయల మార్కెట్లు వెలవెలపోతున్నాయి. గత వారం కిలో టమాటా రూ.25 ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.60కి అమ్ముతున్నారు. అలాగే గత వారం కిలో పచ్చిమిర్చి రూ.30 అమ్మగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.60కి చేరింది. కొత్తిమీర కట్ట రూ.12 ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో కట్ట రూ.30కు అమ్ముతున్నారు. అల్లం ధర సామాన్య ప్రజలు భయాందోళన చెందేలా కిలో రూ.260కు చేరింది. అలాగే బెండకాయలు రూ.40, ఉల్లిపాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.40, వంకాయలు రూ.40, క్యారెట్ రూ.42 ధరలు పలుకుతున్నాయి. వీటి ధరలను చూసి వినియోగదారులు షాక్ అవుతున్నారు. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం ధరలు డబల్ కావడంతో వామ్మో అని నోరు వెల్లబెడుతున్నారు. అధిక ధరల కారణంగా భోజనంలో కూరగాయలను పచ్చళ్ల మాదిరిగా తీసుకోవాల్సి వస్తున్నదని వినియోగదారులు వాపోతున్నారు.



వడ్డాది మార్కెట్‌లో కూరగాయలు



నాతవరంలో విక్రయానికి ఉంచిన పచ్చిమిర్చి

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

కశింకోట, జూన్ 12: మండలంలోని నర్సింగబిల్లిలో గల జీడిపిక్కల పరిశ్రమలో బుధవారం న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎలమంచిలి అడిషనల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ టి.వీర రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ముఖ్యంగా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. సన్ ఫుడ్ ఫ్యాక్టరీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏజీపీ డి.వెంకట్రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నూకరాజు, కార్యదర్శి బి.శంకరరావు, ఉపాధ్యక్షుడు పి.వి.రమణ, ఫ్యాక్టరీ యజమాని బి.అనీల్‌కుమార్, కార్మిక శాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ అవగాహన సదస్సు మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ వీర రాఘవేంద్రరావు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, జూన్ 12: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు వాపోయారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, నక్కపల్లి, మాడుగుల, చోడవరం, కోటపాడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరిపై పనిభారం అధికంగా ఉందన్నారు. గత రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. నర్సీపట్నం ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి వివరాలు కూడా అందించడం లేదన్నారు. కనీస వేతనం రూ. 16వేలు ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలు చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్

అనకాపల్లి టౌన్, జూన్ 12 : రాష్ట్రానికి ప్రధాని మోదీ ప్రత్యేక హోదా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీనగరం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రధాని హామీ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అత్యంత కీలక స్థానంలో ఉన్న టీడీపీ మరింత చొరవ చూపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అసంపూర్తిగా గిడుతూరు పాఠశాల భవనం

- రెండేళ్లుగా కొనసా...గుతున్న నిర్మాణం

మాకవరపాలెం, జూన్ 12: గిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. నాడు-నేడు పథకంలో భాగంగా మంజూరైన పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు రెండేళ్లగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి తరగతి గదులు కొరత కారణంగా ఎప్పటి నుంచో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అదనపు తరగతుల నిర్మాణానికి 2022లో నాడు-నేడు పథకం కింద సుమారు రూ.47 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నిర్మాణ పనులు మొదలపెట్టారు. అయితే గత రెండేళ్లగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పాఠశాల భవన నిర్మాణ పనులపై అధికారులు కనీసం పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభమైనా భవనం అసంపూర్తిగానే ఉండడం సరికాదని, ఇప్పటికైనా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం ఇదే...

సత్యనారాయణస్వామి దేవస్థానం పాలకవర్గం రాజీనామా



ఆలయ అధికారులకు రాజీనామా పత్రం ఇస్తున్న ఛైర్మన్ కేఎం నాయుడు

అనకాపల్లి టౌన్, జూన్ 12: ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయ పాలకమండలి బుధవారం రాజీనామా చేసింది. ఈ మేరకు ఆలయ ఈవోకు ఛైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు, ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు ముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నరసింగరావులు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడంతో తమ పాలకవర్గం రాజీనామా చేసినట్టు వారు తెలిపారు.